సాక్షి
చిత్తూరు

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



బాబు అవినీతి బట్టబయలు

రాజధాని పేరుతో బాబు చేసిన అవినీతి బట్టబయలైందని, జైలుకెళ్లడం ఖాయమని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. - 8లో



మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

తమిళనాడు నుంచి అక్రమంగా మద్యం తరలిరాకుండా నిఘా ఉంచాలని ఎస్ఈబీ డీసీ నాగమద్దయ్య తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	25
తిరుపతి	36	26
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	36	26

న్యూస్‌రీల్

వేడుకగా గోకులాష్టమి



గోవులకు పశుగ్రాసం తినిపిస్తున్న కాణిపాకం ఆలయ చైర్మన్, ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం గోశాలలో గురువారం గోకులాష్టమిని వేడుకగా నిర్వహించారు. పూజాసామాగ్రిని ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, అధికారులు మేళ తాళాల నడుమ ఊరేగింపుగా గోశాలకు తీసుకొచ్చారు. అక్కడ శ్రీకృష్ణ భగవానుడి విగ్రహానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవులకు పూజలు చేసి వాటికి పశుగ్రాసం అందించారు. చివరగా ఉట్టికొట్టి సంబరాలు జరుపుకున్నారు. రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

11 నుంచి స్కూల్ గేమ్స్

నగరి : జిల్లాలో ఈనెల11వ తేదీ నుంచి 67వ స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో విజయేంద్రరావు, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి వి.సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, త్రోబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఈనెల 11నుంచి 17 వరకు మండల స్థాయి, 18 నుంచి 26వ తేదీ వరకు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ క్రీడలకు అకడమిక్ మానిటరింగ్ యాప్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరని పేర్కొన్నారు. 2010 జనవరి ఒకటి తర్వాత జన్మించిన విద్యార్థులు అండర్–14 క్యాటగిరీకి, 2007 జనవరి ఒకటి తర్వాత జన్మించిన విద్యార్థులు అండర్–17 క్యాటగిరీకి అర్హులని తెలియజేశారు. పోటీలకు క్రీడాకారులను సిద్ధం చేయాలని పీడీలు, పీఈటీలు, హెచ్‌ఎంలకు సూచించారు.

అభ్యంతరాలుంటే తెలపండి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ఓటర్ల జాబితా సవరణలో అభ్యంతరాలుంటే తెలియజేయాలని డీఆర్‌వో రాజశేఖర్ తెలిపారు. గురువారం ఓటర్ల జాబితా సవరణప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు,చేర్పులకు వారం రోజులుగా ఫారం6, ఫారం 8కి సంబంధించి దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆ దరఖాస్తులపై క్షేత్రస్థాయి విచారణ జరుగుతోందని తెలిపారు. రాజకీయ పార్టీల అభ్యర్థన మేరకు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులతో పాటు ఫిర్యాదులకు అవకాశం ఉన్నట్లు చెప్పారు. రాజకీయపార్టీల ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, పలు రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎక్కడికక్కడే మాదకద్రవ్యాల కట్టడి



మాట్లాడుతున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: మాదకద్రవ్యాలు, అక్రమ మద్యాన్ని ఏమాత్రం ఉపేక్షించొద్దని ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశించారు. గురువారం నగరంలోని పోలీసు అతిథి గృహంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) ఏఎస్పీ శ్రీలక్ష్మితో కలిసి ఎస్‌ఈబీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ సారా తయారీ, తరలింపుపై ఏమరపాటుగా ఉండకూడదని తెలిపారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలను వాడినా, తీసుకొచ్చిన కేసులు నమోదు చేయాలన్నారు. కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యంను ఎక్కడికక్కడ కట్టడి చేయాలని తెలిపారు. ఇలాంటి కేసుల్లో నిందితులను పట్టుకోవడంతో పాటు నేరం రుజువు చేసి, కోర్టులో శిక్ష పడేలా సాక్ష్యాలు సేకరించాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తిచేసి, చార్జ్‌షీట్ దాఖలు చేయాలని పేర్కొన్నారు. సారా వృత్తి వదిలేసిన కుటుంబాలకు రుణాలు అందేలా చూడాల్సిన బాధ్యత ఎస్‌ఈబీపై ఉందని గుర్తు చేశారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన అధికారులు, సిబ్బందికి ఎస్పీ రిషాంత్‌రెడ్డి ప్రశంసా పత్రాలు అందచేశారు. సమావేశంలో ఎస్‌ఈబీ ఇన్‌చార్జ్ అధికారి నాగమద్దయ్య, పలువురు సీఐలు,ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉద్యోగ విప్లవం

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 327కు పైగా జాబ్‌మేళాల నిర్వహణ
- 78 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన
- నేడు వెంకటగిరిలో మెగా జాబ్ మేళా
- త్వరలో ఎస్వీయూలో మరో మెగా జాబ్ మేళాకు సన్నాహాలు

తిరుపతి సిటీ : జిల్లాలో ఉద్యోగ విప్లవం నడుస్తోంది. నిరుద్యోగ సమస్యను పూర్తిగా రూపు మాపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేస్తోంది. నాలుగేళ్లలో సుమారు 2.5 లక్షలకు పైగా గ్రామసచివాలయాలతోపాటు ఏపీపీఎస్సీ ద్వారా గ్రూప్–1, గ్రూప్–2, 4 నోటిఫికేషన్లు విడుదల చేసి వేలాది మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించింది. త్వరలో మరో మారు గ్రూప్–1, 2 నోటిఫికేషన్లతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో వేల సంఖ్యలో అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. అలాగే గ్రామీణ యువతకు మండల, పట్టణ, నియోజకవర్గ కేంద్రాల్లో వందలాది జాబ్ మేళాలు నిర్వహించి వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన 2019 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మండల, నియోజకవర్గాలు, ప్రత్యేక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీల్లో సుమారు 327 జాబ్‌మేళాలను నిర్వహించారు. ఇక్కడికి ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా రాయలసీమ జిల్లాల నుంచి 1,88,618 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఇప్పటి వరకు నిర్వహించిన జాబ్ మేళాల్లో సుమారు 78,230 వేల మంది ఎంఎన్‌సీ కంపెనీల్లో మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు పొందారు. 2022లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఎస్వీయూనివర్సిటీ వేదికగా నిర్వహించిన మెగా జాబ్ మేళాలో రికార్డు స్థాయిలో లక్ష మందికి పైగా నిరుద్యోగులు హాజరుకాగా 28 వేల మందికి పైగా అభ్యర్థులు జాతీయ, అంతర్జాతీయ కంపెనీల్లో మంచి వేతనాలతో ఉద్యోగాలు సాధించారు.

త్వరలో ఎస్వీయూలో..

గత నెలలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వేదికగా ప్రభుత్వం నిర్వహించిన జాబ్‌మేళాలో సుమారు 30 ఎంఎన్‌సీ కంపెనీలు పాల్గొని సుమారు 3 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. ఈ క్రమంలో ఈ నెల 7, 8 తేదీల్లో సుమారు 40 కంపెనీలతో ఎస్వీ యూనివర్సిటీలో మరో మెగా జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగులకు మంచి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో మరిన్ని ఎంఎన్‌సీ కంపెనీలు పాల్గొనే అవకాశం ఉంది. వచ్చే నెలలో నిర్వహించేందుకు ప్రభుత్వ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. త్వరలో తేదీలు ప్రకటించనున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

సంవత్సరం	జాబ్ మేళాలు	హాజరైన అభ్యర్థులు	ఉద్యోగాలు పొందిన వారు
2019	52	12,754	8258
2020	68	15,289	10,950
2021	74	18,269	13,250
2022	95	1,32,014	38,251
2023	38	10,292	7,521



తిరుపతిలో జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు (ఫైల్)

ఉద్యోగ ప్రాప్తిరస్తు

- నేడు వెంకటగిరిలో మెగా జాబ్‌మేళా
- నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలో శుక్రవారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాకు ఏర్పాట్లు పూర్తయ్యా యి. నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. 8వ తరగతి నుంచి బీటెక్, ఎంటెక్, ఇంజినీరింగ్, పీజీ వంటి చదువులు చదువుకున్న నిరుద్యోగులు సుమారు ఆరువేల మంది హాజరుకావచ్చని అంచనా. ఈ మేరకు వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసం వద్ద పటిష్ఠ బందోబస్తు మధ్య ఏర్పాట్లు పూర్తిచేశారు. బారికేడ్లు, చలువ పందెళ్లు, అభ్యర్థులు కూర్చోవడానికి వస తి సౌకర్యాలను సిద్ధం చేశారు. జాబ్ మేళాకు వచ్చే నిరుద్యోగులు, వారి సహాయకులకు వేర్వేరుగా భోజన వసతి సౌకర్యం కల్పించనున్నారు. ఈ మేళాలో 49 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు పాల్గొననున్నారు. ఇప్పటికే 4వేల మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు.



ఎన్‌జీఆర్ భవనం వద్ద ఇంటర్వ్యూలకు ఏర్పాటు చేసిన క్యాబిన్‌లు



భోజన వసతి కోసం శుభ్రం చేస్తున్న స్థలాన్ని పరిశీలిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

ప్రతి ఒక్కరికి ఉద్యోగ అవకాశం

వెంకటగిరి నియోజకవర్గ పరిధిలో ప్రతి నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగాలు కల్పించడమే నా ధ్యేయం. గడప గడప కార్యక్రమంలో నా దృష్టికి వచ్చిన సమస్యను పరిష్కరించాలని నిర్ణయించా. అందుకే మేగా జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నా. ఇప్పటికే కొందరు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి కూడా అవకాశం కల్పించాం. అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలి.

– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త

శ్రీనివాస సేతుకు తుదిమెరుగులు

- 18న సీఎం చేతులు మీదుగా ప్రారంభానికి విస్తృత ఏర్పాట్లు
- స్మార్ట్ సిటీ ఎండీ హరిత



ఫ్లైఓవర్ పనులను పరిశీలిస్తున్న స్మార్ట్ సిటీ ఎండీ హరిత

తిరుపతి తుడా: స్మార్ట్ సిటీ కార్పొరేషన్, తిరుమల– తిరుపతి దేవస్థానం సంయుక్త భాగస్వామ్యంతో నిర్మిస్తున్న శ్రీనివాస సేతు తుది మెరుగులు దిద్దుకుంటుందని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత పేర్కొన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ఇంజినీర్లతో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఏర్పాట్లలో ఎక్కడ చిన్నపాటి లోపం లేకుండా పెద్ద ఎత్తున ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం చేయాలని చెప్పారు. ప్రెస్ట్ రెస్సింగ్ పనులను ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీనివాససేతును ప్రారంభించనున్నట్టు చెప్పారు. పనులు పూర్తి కావడంతో అదే రోజు నుంచి ప్రజలకు ఫ్లైఓవర్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుందని చెప్పారు. ఇందుకోసం విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 15వ తేదీ కల్లా అన్ని పనులు పూర్తి చేసుకుంటారని చెప్పారు. చివరి రెండు రోజుల్లో ఫ్లైఓవర్ సుందరీకరణ పనులు చేపడతామన్నారు. తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ. 650 కోట్ల వ్యయంతో ఫ్లైఓవర్‌ని నిర్మించామన్నారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా 106 గ్రామాల్లో భూ రీ సర్వే



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో మూడవ విడత భూ రీ సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు వివరించారు. గురువారం విజయవాడ నుంచి రీ సర్వే పురోగతిపై సీసీఎల్‌ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా ప్రగతిని ఇన్‌చార్జ్ కలెక్టర్ వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఈనెలాఖరు లోపు 106 గ్రామాలలో రీసర్వే నిర్వహించి 51,413 సర్వేరాళ్లు నాటే ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. మొదటి విడతలో 130 గ్రామాలలో రీ సర్వే పూర్తి చేసినట్లు చెప్పారు. ఇందులో 105 గ్రామాలకు సంబంధించి 68,632 సర్వే రాళ్లను నాటినట్లు తెలిపారు. మరో 51,413 రాళ్లను ఈనెలాఖరు లోపల నాటించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 35,663 భూ హక్కు పత్రాలు జిల్లాకు రాగా, ఇందులో 22 వేల భూహక్కు పత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 113 రోవర్లు ఉండగా, సర్వే రాళ్లు నాటేందుకు 56 రోవర్లను ఉపయోగిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో సర్వే రాళ్లు నాటడం, భూహక్కు పత్రాల పంపిణీలో పురోగతి సాధించడంపై స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కార్యదర్శులు అభినందించారు. ఈ కాన్ఫరెన్స్‌లో సర్వే శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యో 'పాప'ం!



ఐసీడీఎస్ అధికారులకు చిన్నారిని అప్పగిస్తున్న రుయా సూపరింటెండెంట్ పార్థసారథి రెడ్డి

తిరుపతి తుడా: ముద్దులొలికే మోము..అమాయకంగా కళ్లు తెరచి చూడడం ..ఆకలేస్తే ఏడవడం తప్ప ఆ పసికందుకు ఏమీ తెలియదు....వివాహేతర సంబంధమో.. ఆడబిడ్డ పుట్టిందనో తెలియదుగానీ అభం శుభం తెలియని, ఆ ముక్కుపచ్చలారని పసికందును గుట్టుచప్పుడు కాకుండా వదిలేసి వెళ్లిపోయారు. గురువారం ఉదయం ఈ ఘటన తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వద్ద వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వెనుక నుంచి మెడికల్ కాలేజీ హాస్టల్‌కు ఉన్న మార్గంలోని ఆ కూడలి తిన్నెపైన ఉదయం 9 గంటల ప్రాంతంలో దాదాపు 2 నెలల వయసున్న పసికందు ఏడుపు వినిపించడంతో అటుగా వెళ్తున్న వారు గమనించారు. పసికందు వద్ద ఎవరూ లేకపోవడంతో అనుమానించారు. కొంతసేపు ఎదురుచూసినా ఎవరూ రాకపోవడంతో సమీపంలోని సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు పసికందును ప్రసూతి ఆస్పత్రికి తీసుకెళ్లి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన ఆ పసికందును ఐసీయూలో ఉంచి వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యంగా ఉందని నిర్ధారించారు. తర్వాత పసికందు గురించి ఆస్పత్రి మైకుల్లో అనౌన్స్‌మెంట్ చేయించినా ఎవరూ రాలేదు. ఆ తర్వాత పోలీసులతో పాటు ఐసీడీఎస్ సీడీపీఓ సుధారాణికి సమాచారం ఇచ్చారు. సిబ్బందితో వచ్చిన సీడీపీఓ ఆ పసికందును అక్కున చేర్చుకున్నారు. ప్రస్తుతం ఆ చిన్నారి ఐసీడీఎస్ అధికారుల సంరక్షణలో ఉంది. పాప ఆరోగ్యంగా ఉన్నప్పటికీ ఎందుకు అలా అనాథగా వదిలి వెళ్లారో తెలియాల్సి ఉందని సూపరింటెండెంట్ చెప్పారు.

తండ్రి అట..పసికందును ఇవ్వాలట!

పసికందుకు తండ్రి తానేనని, తనకు ఇవ్వాలంటూ అంటూ ఓ దివ్యాంగుడు మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ఆస్పత్రి అధికారులను కలవడం కొత్త ట్విస్ట్‌కు తావిచ్చింది. తన పేరు వెంకటేష్ అని, తాటితోపులో ఉంటున్నానని చెప్పుకొచ్చాడు. రైలులో వెళ్తుండగా తన భార్య కాలుజారి పడిపోయి చనిపోయిందని, అప్పటి నుంచి పసిబిడ్డ అనాథగా మిగిలిందని, తాను యాచిస్తూ జీవిస్తున్నానని అధికారులకు పొంతనలేని సమాధానాలు చెప్పాడు. ఆస్పత్రిలో కొన్ని గంటలుగా అనౌన్స్‌మెంట్ చేస్తున్నా ఇప్పుడొచ్చావ్..ఇంత సేపూ ఏమయ్యావ్? అనే వాటికి అతడి నుంచి సరైన సమాధానం లేదు. అతడి వాలకం, తీరును అనుమానించి అధికారులు అతడు చెప్పిన వివరాలు ఏమేరకు వాస్తవమో పూర్తి స్థాయిలో విచారణ చేయాలని నిర్ణయించారు.

శరవేగంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను వేగవంతం చేశారు. ఈనెల 18 చవితి నుంచి 21 రోజులు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఆలయం, పరిసరాలను రంగురంగుల పెయింటింగ్‌తో ముస్తాబు చేస్తున్నారు. నిత్యం స్వామివారి దర్శనార్థం లక్ష మంది వచ్చే అవకాశం ఉంటుందన్న అంచనా మేరకు ప్రత్యేక క్యూలు, ప్రసాదాల తయారీ, నిత్యాన్నప్రసాదం తదితరాల ఏర్పాట్లపై దేవస్థానం పాలకమండలి, అధికారులు నిత్యం సమీక్షిస్తూ దగ్గరుండి పనులు చేయిస్తున్నారు.

- 18 నుంచి కాణిపాకం బ్రహ్మోత్సవాలు
- రోజూ లక్ష మంది వస్తారని అంచనా
- సామాన్య భక్తులకు పెద్దపీట
- ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు నిత్యాన్నప్రసాదం

కాణిపాకం(యాదమరి): దేశంలోనే ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా కాణిపాకం విరాజిల్లుతోంది. స్వయంభుగా వెలసిన శ్రీవరసిద్ధి వినాయకస్వామి భక్తుల కొంగుబంగారంగా నీరాజనాలు అందుకుంటున్నారు. ఏటా బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండ కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఇదే సమయంలో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో అక్కడ దర్శనం చేసుకున్న భక్తులు ఇక్కడికి వచ్చే అవకాశం ఉన్నందున తాకిడీ పెరుగుతుందని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు అంచనాలు వేస్తు అందుకు తగ్గటుగా ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేస్తున్నారు. పుష్కరిణిలో పాతనీరు తొలగించి శుభ్రం చేసి, కొత్త నీటిని వదిలారు. ఆలయ రాజగోపురానికి గతంలో పంచ వర్ణాల రంగులు వేశారు. ఆగమ శాస్త్ర ప్రకారం ఏకరంగు ఉండాలని పండితులు సూచించడంతో ఏక వర్ణం వేస్తున్నారు. అలాగే సుపథ మండపం, ఆలయ పరిసరాలు, వాహన సేవలు జరిగే వీధుల్లో రంగులు వేస్తున్నారు. విద్యుద్దీపాలంకరణ, కటౌట్ల ఏర్పాట్ల పనులు జోరందుకున్నాయి.



రాజగోపురానికి రంగులు అద్దుతున్న కూలీలు

10న అద్దాల మండపం కుంభాభిషేకం

ఆలయంలో గతంలో అద్దాల మండపం ఉండేది. అందులో శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామిని అద్దాలలో భక్తులు దర్శించుకునేవారు. ఆలయ పునర్నిర్మాణంలో ఈ మండపాన్ని తొలగించారు. ప్రస్తుతం దాతల సహకారంలో నూతనంగా అద్దాల మండపం నిర్మించారు. పనులు పూర్తి కావడంతో ఈనెల 10వ తేదీన కుంభాభిషేకం నిర్వహించేందుకు దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది.

10 లోపు ఏర్పాట్లు పూర్తి చేస్తాం



బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు వేగవంతం చేశాం. ఈనెల 10లోపు అన్నీ పూర్తి చేస్తాం. ప్రత్యేక క్యూలు, తాగునీరు, ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య అన్నదాన ప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పెయింటింగ్ పనులు పూర్తి చేశాం. సామాన్య భక్తులు సంతృప్తికరంగా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తాం.

–మోహన్ రెడ్డి, చైర్మన్, కాణిపాకం దేవస్థానం

సామాన్య భక్తులకే పెద్దపీట



స్వామివారి దర్శనార్థం వచ్చే సామాన్య భక్తులకే పెద్దపీట వేస్తాం. ఉదయం నుంచి రాత్రి వరకు దర్శనం కల్పిస్తాం. మూడంచెల క్యూల ద్వారా భక్తులను దర్శనానికి అనుమతిస్తాం. వాహన సేవలను తిలకించేందుకు వచ్చే భక్తులకు కూడా సౌకర్యాలు కల్పిస్తాం.

–వెంకటేశు, ఈఓ, కాణిపాకం దేవస్థానం

30న జగనన్న ఆరోగ్య సురక్ష

- అధికారులు సమష్టిగా పనిచేయాలి
- ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఈనెల 30న జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమం అమలుపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్షను ప్రారంభిస్తోందన్నారు. ఈనెల 30 నుంచి కార్యక్రమం అమలవుతుందని చెప్పారు. గ్రామస్థాయిలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మెడికల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఈవోపీఆర్‌డీలను బృందాలుగా నియమిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో కార్యక్రమాలను వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పాటు జెడ్పీ సీఈవో, జిల్లా పంచాయతీ అధికారి, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీ లు బృందాలుగా పర్యవేక్షిస్తారన్నారు. కార్యక్రమం అమలుపై ఎంపీడీవోలు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. 12న శిక్షణ, 16న ఏఎన్‌ఎంలు ఇంటింటి సర్వే చేస్తారని చెప్పారు. 20న ఆరోగ్యశ్రీ కరపత్రాలను పంపిణీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు క్యాంప్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. క్యాంపుల నిర్వహణకు ప్రభుత్వ పాఠశాలలను, అర్బన్ హెల్త్ సెంటర్‌లను ఉపయోగించుకోవాలని చెప్పారు. డీఆర్‌వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, చిత్తూరు నగరపాలక కమిషనర్ అరుణ, డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

నేటి సీఎండీ సమావేశం వాయిదా

చిత్తూరు కార్పొరేషన్: తిరుపతిలో శుక్రవారం జరగాల్సిన సీఎండీ సంతోషరావు సమావేశం వాయిదా పడినట్లు ఈఈలకు సమాచారం అందింది. డిస్కం(రాయలసీమ, నెల్లూరు జిల్లాలు) పరిధిలోని ట్రాన్స్‌కో ఈఈలతో సీఎండీ శుక్రవారం సమావేశం కావాల్సి ఉంది. విజయవాడలో ఇంజినీర్ల సంఘంతో అత్యవసర సమావేశం దృష్ట్యా, ఈకార్యక్రమాన్ని వాయిదా వేశారు. తదుపరి సమావేశం నిర్వహించనున్న తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు సీఎండీ కార్యలయం పేర్కొంది.

క్లుప్తంగా

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం



రికార్డులను తనిఖీచేస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

గుడిపాల: తమిళనాడు నుంచి అక్రమంగా వస్తున్న మద్యంపై ఉక్కుపాదం మోపాలని ఎస్ఈబీ(స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో) డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. గురువారం నరహరిపేట స్పెషల్ ఎన్ఫోర్స్ మెంట్ బ్యూరో చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుడిపాల మండలం తమిళనాడు సరిహద్దు ప్రాంతంలో ఉండడంతో అక్కడి నుంచి అక్రమ మద్యం తరలివచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రత్యేకంగా నిఘా ఉంచాలన్నారు. చెక్‌పోస్ట్ రికార్డులను పరిశీలించారు. ఎస్ఈబీ సూపరింటెండెంట్ బాబుశ్రీధర్, సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం పాల్గొన్నారు.

శిశు విహార్‌లో బిడ్డ మృతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని శిశువిహార్ కేంద్రంలో గురువారం ఏడు నెలల వయసున్న పాప మృతి చెందింది. రాయల్‌పాడుకు చెందిన ఓ దంపతులు తమ పాపకు ఊపిరితిత్తి సరిగా పనిచేయకపోవడంతో ఇటీవల చిత్తూరులోని శిశువిహార్‌కు అప్పగించారు. కొంతకాలంగా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాప అనారోగ్యంతో మృతి చెందింది.

రేపు జాతీయ లోక్ అదాలత్



కరుణకుమార్

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. రాజీ చేసుకోదగిన కేసులను కక్షిదారులు అదాలత్‌లో పరిష్కరించుకోవాలని కోరారు. జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో అదాలత్ కోసం 35 బెంచ్‌లు ఏర్పాటు చేశామని, 16,779 కేసులను పరిష్కరించడానికి గుర్తించామన్నారు. ప్రధానంగా చెక్‌బౌన్స్, మోటారు వాహనాల ప్రమాదాలు, బీమా, కుటుంబ తగాదాల కేసులను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తికి స్వాగతం పలుకుతున్న ఇస్కాన్ అధ్యక్షుడు

శ్రీరాధాగోవిందులను దర్శించుకున్న టీటీడీ చైర్మన్

టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఇస్కాన్ మందిరంలోని శ్రీరాధాగోవిందులను దర్శించుకున్నారు. వీరికి ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు, ప్రతినిధులు సాదర స్వాగతం పలికి శ్రీరాధాగోవిందుల దర్శనం కల్పించి ప్రసాదాలు వితరణ చేశారు. అలాగే ఎంపీ డాక్టర్ గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ డీ.హరిత, డెప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, భూమన అభినాయ్‌రెడ్డి శ్రీరాధాగోవిందులను దర్శించుకున్నారు.



గోవుకు మేత తినిపిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

ముకుందా..మురారి!

- కనుల పండుగగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు
- భక్తజనంతో పులకించిన ఇస్కాన్ మందిరం

తిరుపతి కల్చరల్: లోకరక్షకుడై జగన్నాథుడుగా భక్తజనావళి పూజలందుకుంటున్న శ్రీకృష్ణ భగవానుని జన్మాష్టమి వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవంగా జరిగాయి. ఇస్కాన్ మందిరాలు, కృష్ణ మందిరాలలో శ్రీరాధాగోవిందులను భక్తజనం భక్తితో దర్శించి పులకించారు. ఇందులో భాగంగా తిరుపతి నగరంలో వెలసిన ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం మంగళహారతి, తులసి పూజ, నరసింహ కీర్తన జపంతో వేడుకలు ఆరంభమయ్యాయి. శ్రీరాధాగోవిందులతో పాటు అష్ట సఖులను విశేష పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి కొలువుదీర్చారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు తండోపతండాలుగా ఇస్కాన్ మందిరానికి తరలి వచ్చి శ్రీరాధాగోవిందులను దర్శించుకున్నారు.

ఉట్లోత్సాహం

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఇస్కాన్ మందిరం ఎదురుగానున్న టీటీడీ మైదానంలో ఉట్లోత్సవం ఉత్సాహభరితంగా సాగింది. యువత రంగునీటి జలకాల నడుమ ఉట్టి కొట్టేందుకు పోటీ పడ్డారు. అనంతరం ఉట్టి కొట్టిన యువతకు బహుమతి అందజేశారు.



ఉట్లోత్సవంలో యువత కేరింత

వేడుకగా మహా శంఖాభిషేకం

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని ఇస్కాన్ మందిరంలో గురువారం రాత్రి 11 గంటలకు శ్రీరాధాగోవిందుల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా మహా శంఖాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు పలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు.

సాహివాల్ గోసంతతి అభివృద్ధికి కృషి

తిరుపతి రూరల్: దేశీయ గోవుల్లో అధిక ప్రాధాన్యత కలిగిన సాహివాల్ గోసంతతి అభివృద్ధి కేంద్రంగా టీటీడీ గోసంరక్షణ శాలను తీర్చిదిద్దనున్నట్టు టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. సాహివాల్ గోసంతతి అభివృద్ధి కోసం రూ.40 కోట్ల నిధులను గ్రాంట్‌గా కేంద్రం మంజూరు చేసినట్లు తెలిపారు. గోకులాష్టమి సందర్భంగా తిరుపతిలోని టీటీడీ ఎస్వీ గోసంరక్షణశాలలో గోకులాష్టమి–గోపూజ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అలిపిరి వద్ద గల సప్తగోప్రదక్షిణ మందిరంలో వేణుగోపాల స్వామి వారికి విశేషంగా అభిషేకం చేశారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గోవు హిందువులకు తల్లి లాంటిదని, భగవంతునితో సమానంగా పూజలు చేస్తారని, అలాంటి గోవును సంరక్షించుకోవాల్సిన బాధ్యత భారతీయులందరిపైనా ఉందన్నారు. అవసరమైన రైతులకు గోవులను దానంగా ఇస్తున్నట్టు చెప్పారు.



గోశాలలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

టీటీడీ చైర్మన్‌కు కళాకారులు ఘన స్వాగతం పలికారు. గజరాజులకు చెరుకు, పండ్లు అందించిన అనంతరం శ్రీ వేణుగోపాల స్వామివారిని చైర్మన్ దర్శించుకున్నారు. అక్కడి నుంచి గో మందిరానికి చేరుకుని, గోవు, దూడకు శాస్త్రబద్ధంగా పూజలు నిర్వహించి పూల దండలు వేసి, నూతన వస్త్రాలు సమర్పించారు. దాణా, మేత తినిపించి పాలు సేకరించారు. అనంతరం గోసంరక్షణశాలలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర దివ్య మహా మంత్ర యజ్ఞం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. తరువాత శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపం పుస్తకాలను స్తూపంలో సమర్పించారు. చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎస్వీ గో సంరక్షణ కమిటీ సభ్యులు రామ్ సునీల్‌రెడ్డి, సీవీఎస్ఓ నరసింహ కిషోర్, గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని ఒత్తిడి తెస్తాం



బస్సు యాత్రలో సీపీఐ నేతలు రామకృష్ణ తదితరులు

పుంగనూరు: నిలకడ లేని ధరలతో రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. గురువారం పుంగనూరు పట్టణంలో రామకృష్ణ బృందం బస్సుయాత్ర నిర్వహించింది. నేరుగా టమాటా మండీలను పరిశీలించింది. టమాటా ధరలపై రైతులతో చర్చించింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గత నెలలో టమాటాలు కిలో రూ.200 పలికిందని, నేడు 15 కిలోల బాక్స్ ధర రూ.100కు పతనం కావడంతో రైతులకు గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. రైతులను ఆదుకోవడానికి అవసరమైతే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.

సమర్థవంతంగా ఫ్యామిలీ డాక్టర్

- 15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన
- ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు



జిల్లా అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తున్నట్టు ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీనివాసులు వివరించారు. గురువారం విజయవాడ నుంచి వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు తీరుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ జిల్లా ప్రగతిని వివరించారు. అనంతరం ఆయన జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని విజయవంతం చేయాలన్నారు. విస్తృత అవగాహన కల్పించేందుకు ఈనెల 15 నుంచి వలంటీర్లు ఇంటింటి ప్రచారం చేయాలని తెలిపారు. గర్భిణులు బాలింతలు, కౌమార దశ బాలికల్లో రక్తహీనత తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలన్నారు. బరువు తక్కువ ఉన్న, ఎత్తుకు తగ్గ బరువు లేని వారికి అవసరమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ అర్హులే ఉపయోగించుకోనేలా ఆశ, ఏఎన్ఎంలు పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇక నుంచి ప్రతి బుధ, శుక్రవారాల్లో మండల స్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వంలో చేపట్టిన పనులను త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఈవో విజయేంద్రరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



పార్వతి(ఫైల్)

చౌడేపల్లె: మండలంలోని పరికిదొన పంచాయతీ సామిరెడ్డిపల్లెకు చెందిన పాలేటికుమార్తె కె.పార్వతి (18) ఈనెల 3వ తేదీ నుంచి కనపడడం లేదని, ఆచూకీ తెలిసిన వారు సమాచారమివ్వాలని ఎస్ఐ రవికుమార్ తెలిపారు. పార్వతి ఇంటర్ చదువుతూ నిలిచిపోయింది. ఇంటి వద్దనే ఉండేది. ఈ నేపథ్యంలో ఆ యువతి అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బాబు అవినీతి బట్టబయలు

బైరెడ్డిపల్లె : రాజధాని పేరుతో చంద్రబాబు చేసిన అవినీతి బాగోతం బట్టబయలైందని, అవినీతి కేసుల్లో బాబు ఇక జైలుకెళ్లడం ఖాయమని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. గురువారం ఆయన బైరెడ్డిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ బోగస్ కంపెనీలు సృష్టించి వాటి ద్వారా రూ.118.96 కోట్లు ముడుపులు చంద్రబాబు పుచ్చుకున్నట్లు ఐటీశాఖ లోతుగా దర్యాప్తు చేసి నిజాలు బట్టబయలు చేసిందన్నారు. ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులకు బాబు స్పందించకుండా తనపై దర్యాప్తు చేసే అధికారం ఆ శాఖకు లేదంటూ లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని తెలిపారు. నిజాయితీ ఉంటే బాబు విచారణకు హాజరై ప్రజలు, దర్యాప్తు సంస్థల ఎదుట నిజం ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు, వ్యవస్థలను మభ్యపెట్టి అవినీతి కేసుల నుంచి తప్పించుకునేందుకు బాబు ఆడుతున్న దొంగ నాటకాలు బయట పడ్డాయన్నారు. లోకేష్‌కు కూడా ఈ అవినీతిలో పాత్ర ఉందని తేటతెల్లమైందన్నారు. బాబు ఇక జైలుకెళ్లడం ఖాయమని పేర్కొన్నారు. అంతకు ముందు వెలుగు ఉద్యోగులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. సీఎం తమకు 23 శాతం జీతం పెంచి తమ జీవితాల్లో వెలుగులు నింపారని వెలుగు ఉద్యోగులు ఈసందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా పరిధిలో గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శులు 11 మందికి , మరో సీనియర్ సహాయకుడికి విస్తరణాధికారులుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు చేసింది. వారికి కేటాయించిన ప్రాంతాల వివరాలను డీపీఓ లక్ష్మి వెల్లడించారు.

పేరు	పనిచేస్తున్న ప్రాంతం	కేటాయించిన జిల్లా
శారద	కాపుగన్నేరు	చిత్తూరు
కుసుమ	పాలకల	చిత్తూరు
ప్రభురావు	తూకివాకం	అన్నమయ్య
మోహన్‌ప్రతాప్	డీఎల్‌పీఓ కార్యాలయం మదనపల్లె	తిరుపతి
బ్రహ్మానందరెడ్డి	కలికిరి	అన్నమయ్య
విజయభాస్కర్	రేణిగుంట	తిరుపతి
దయాసాగర్	చియ్యవరం	తిరుపతి
మదన్‌మోహన్‌రాజు	చిన్నగొట్టిగల్లు	కర్నూలు
సుధాకర్‌రెడ్డి	పాలెంపల్లె	అన్నమయ్య
శ్రీనివాసులు	తనపల్లె	తిరుపతి
రమణకుమార్	ఎలమండ్యం	తిరుపతి
లక్ష్మీదేవి	గంగవరం	చిత్తూరు

శ్రీకృష్ణుడిగా లక్ష్మీనరసింహుడు



శేషవాహనంపై శ్రీకృష్ణునిగా పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మిదేవి,చెంచులక్ష్మిదేవి

రాపూరు: పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి గురువారం రాత్రి శ్రీకృష్ణుడి అలంకరణలో అలరించారు. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని అలంకార మండపంలో శేష వాహనంపై పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మీదేవతలను కొలువుదీర్చారు. అనంతరం స్వామివారిని శ్రీకృష్ణుడిగా అలంకరించి మేళతాళాల నడుమ కోన వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. గోవులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి,అమ్మవార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం స్నపన తిరుమంజనం.. సాయంత్రం ఉట్టి మహోత్సవం నిర్వహించారు.